క్లుప్తంగా

కల్కి అవతారంలో.. జగన్నాథుడు



కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: దుష్ట సంహారం నిమిత్తం బయలుదేరిన కల్కి అవతారంలో జగన్నాథ స్వామి ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో డాలు ధరించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ నిమిత్తం కల్కి భగవానుడు అవతారంలో ఉన్న జగన్నాథుడిని పలువురు భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న జగన్నాథుడి రథోత్సవాలను పురస్కరించుకుని స్వామి ఆలయ యాగశాలలో రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నారసింహుని క్షేత్రానికి పాదయాత్రగా..



ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై పోటెత్తిన పాదయాత్ర భక్తులు

ద్వారకాతిరుమల: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం నుంచి సుమారు 15 వేల మంది భక్తులు పాదయాత్రగా ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి ఆదివారం విచ్చేశారు. వీరంతా ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం దాతల సహకారంతో ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాదాన్ని 6 వేల మంది భక్తులు స్వీకరించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. గుంటూరు జిల్లా పట్టాభిపురంనకు చెందిన కొరిటాల శ్రీనివాస్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆలయ నిర్మాణంపై గ్రామ పెద్దల సమావేశం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామ ప్రజలు అత్యంత ఆత్రుతతో ఎదురుచూస్తున్న శ్రీ చింతాలమ్మ అమ్మవారి నిర్మాణానికి శ్రీకారం పలికారు. గ్రామ దేవత చింతాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం గ్రామ పెద్దలు సమావేశమై ఆలయ నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ పర్యవేక్షణలో రాజకీయ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొని చర్చలు జరిపారు. శ్రావణ మాసం ముగిసేలోగా అమ్మవారి ఆలయ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో విరాళాల సేకరణకు కమిటీని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాల్సిందిగా పెద్దలు ఏకాభిప్రాయానికి వచ్చారు. అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

జంగారెడ్డిగూడెం: కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే అంటూ పోరాటం చేసిన వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి అర్జుల మురళి అన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఉపాధ్యక్షుడు సొలస రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మేరా యువ భారత్ వారి ఆధ్వర్యంలో స్థానిక సూర్య డిగ్రీ కళాశాలలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు.

మాజీ మంత్రి వనిత పరామర్శ

ద్వారకాతిరుమల: మండలంలోని రాజా పంగిడిగూడెంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్నం కొండయ్య కుటుంబాన్ని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కొండయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 4న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వనిత ఆయన ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కొండయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి మహాలక్ష్ముడు, మానుకొండ సుబ్బారావు, గుర్రాల లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



జంగారెడ్డిగూడెం: కోదండరామచంద్రస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కొయ్యలగూడెం: శ్రీ విధమ్మ అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహించేందుకు తరలివచ్చిన మహిళలు



బుట్టాయగూడెం: కుమ్మరిగట్టు వద్ద అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: తొలి ఏకాదశి పూజలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వైష్ణవాలయాలతో పాటు, అమ్మవార్ల ఆలయాలను దర్శించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని రామచంద్రాపురంలో కొలువైన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సామూహిక రమా సమేత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. తొలుత 108 వెండి పుష్పాలతో స్వామి వారికి అష్టోత్తరం, గోత్రనామార్చనలు అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పరిమి ధర్మరాజు, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, అధ్యక్షుడు మోతుకూరి నారాయణరావు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

కొయ్యలగూడెం: మండలంలోని వైష్ణవ క్షేత్రాలతో పాటు శైవ క్షేత్రాలు, గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు పారాయణాది, అర్చనాది కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న శ్రీ విధమ్మ అమ్మవారి ఆలయం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహించారు. మహిళలు పారాణి బిందెలతో తరలివచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. దిప్పకాయలపాడు, అంకాలగూడెం, బోడిగూడెం, గ్రామాలలోని విధమ్మ ఆలయాలలో నైవేద్యాలు సమర్పించారు. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి శయన ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా అర్చకులు గుడిపూడి శేషాచార్యులు నిర్వహించారు. గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శ్రీ లలిత సహస్రనామ కోటి పారాయణ కార్యక్రమాన్ని బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహమూర్తి ప్రారంభించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బుట్టాయగూడెం: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కుటుంబ సమేతంగా దైవ దర్శనాలు చేసుకున్నారు. స్థానిక శివాలయంలో, కుమ్మరిగట్టు వద్ద గల ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. కుమ్మరిగట్టు నుంచి బుట్టాయగూడెం వరకూ ఊరేగింపు నిర్వహించి అనంతరం శివాలయం వద్ద పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్థానిక సాయిబాబా గుడిలో కూడా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే రెడ్డిగణపవరం, దొరమామిడి ఆలయాల్లో కూడా తొలి ఏకాదశి పూజలు జరిపారు.

పారిజాతగిరిలో పూజలు



జంగారెడ్డిగూడెం: విశేషాలంకరణలో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి

తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం గోవింద నామ స్మరణతో మార్మోగింది. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. స్వామివారికి పూజ టికెట్ల ద్వారా రూ.29,595, విరాళాల రూపంలో రూ.24,876, ప్రసాదాల ద్వారా రూ.30,610 మొత్తం రూ.85,081 వచ్చినట్లు ఈవో తెలిపారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు, రెడ్డి రంగప్రసాద్, వాసవి సాయినగేష్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సు విజయవంతంపై హర్షం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో సదస్సు విజయవంతంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ఏలూరు పార్లమెంటు ఇన్‌చార్జి కారుమూరు సునీల్, పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తెల్లం బాలరాజు, కంభం విజయరాజు ముఖ్య అతిథులుగా పాల్గొనడం పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపిందని అన్నారు. ఏడు మండలాల నుంచి రెండు వేల మందికి పైగా పార్టీ శ్రేణులు పాల్గొనడం నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రజా సమస్యలపై నిరంతరం కూటమి ప్రభుత్వంపై పోరాడుతూ జగన్ 2.0 పాలనకు కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు గొడ్డటి నాగేశ్వరరావు, నూకల రాము, తోట జయబాబు, పసుపులేటి రాంబాబు, గంటా రమేష్, మందపాటి రామకృష్ణ, పాల్గొన్నారు.

వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోని కల్పవృక్షం వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వరల్డ్ బిర్యాని డే సందర్భంగా సింహపురి గ్రూపు ఆఫ్ హోటల్స్ యజమాని మన్నే వెంకటరత్నం చౌదరి సౌజన్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరాదరణకు గురైన వృద్ధులను ఆదరించడం, ఆకలి తీర్చడం దేవుని సేవతో సమానమని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మాజేటి సత్యనారాయణ పేర్కొన్నారు.

సహజ వనరులు కార్పొరేట్ల పరం



సభలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

చింతలపూడి: సహజ వనరులను కార్పొరేట్లకు, కాంట్రాక్టర్లకు కట్టబెట్టడానికే పోలవరం టు బనకచర్ల ప్రాజెక్టు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ విమర్శించారు. ఆ పార్టీ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభల్లో భాగంగా రెండోరోజైన ఆదివారం జరిగిన ప్రతినిధుల సభలో ఆమె మాట్లాడారు. దేశాన్ని మత, కుల ఆధిపత్యం వైపు వెళ్లే విధంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలిస్తూ, రాజ్యాంగంపై ఆర్‌ఎస్‌ఎస్ దాడి చేస్తోందని చెప్పారు. సభకు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ, నేతలు వెంకటరామారావు, ఎం.వసంతరావు, డేగా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో తనిఖీ



ఆర్టీసీ డిపో వద్ద గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్‌కే షబ్నం

జంగారెడ్డిగూడెం: ఉచిత ప్రయాణం దృష్ట్యా బస్సుల నిర్వహణ సరిగా ఉండేలా చూడాలని ఆర్టీసీ కార్మికులకు జిల్లా డీపీటీవో ఎస్‌కే షబ్నం సూచించారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం దృష్ట్యా పెరిగే రద్దీకి తగ్గట్లుగా బస్సులు మెయింటెనెన్స్ చేయాలని, బ్రేక్ డౌన్ లేకుండా జాగ్రత్తలు తీసుకుని ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్‌లు నడపాలన్నారు. జంగారెడ్డిగూడెం డిపో పరిధిలో గల కొయ్యలగూడెం, కామవరపుకోట, పోలవరం బస్ స్టాండ్‌లను పరిశీలించి జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్‌కు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేయాలి

కంభం విజయరాజు పిలుపు



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కర్పూరం గవరయ్య గుప్త (నాని) ప్రమాణ స్వీకార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గవరయ్య గుప్తచే పట్టణ మాజీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో విజయరాజు మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చకుండానే ప్రజల్లోకి వెళుతున్నారని. దీంతో వారిని నిలదీసే పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు మేలు చేశారన్నారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ నినాదంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

మరో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావు మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ కో-ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ పదవులు అలంకారాలు కాదని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్‌లు, మండల కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర, ముప్పిడి శ్రీను, చింతా అనిల్‌కుమార్, షేక్ అక్బర్, చనమాల శ్రీనివాస్, వందనపు వెంకటేశ్వరరావు, బత్తిన చిన్న, జెట్టి ఆదిత్య, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ నూతన అధ్యక్షుడి కర్పూరం గవరయ్య గుప్త, కంభం విజయరాజులను నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలి



ఆపస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం(ఆపస్) జిల్లా కార్యవర్గ సమావేశం పట్టణంలోని పార్కు రోడ్డులో గల సంఘ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఇజి.సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఆప్షనల్ హాలిడే వల్ల సగం మంది ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు హాజరైతే విద్యార్థులకు పాఠాలు పూర్తి స్థాయిలో చెప్పడానికి అవకాశం ఉండదని, కావున ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల మొత్తానికి సెలవు ఇవ్వాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నందు డాక్యుమెంటేషన్, ఫొటోలు అప్‌లోడ్ చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఉండాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. ఉపాధ్యాయులు ఉదయం 7 గంటల లోపే సెలవు అప్లై చేయమనడం సరికాదని, ఉదయం 9 గంటల వరకు సమయం ఉండాలన్నారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని పాఠశాల ముగిసిన తర్వాత కాకుండా పాఠశాల పని వేళల్లోనే ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డి నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి బీవీ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి జి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



గూటాలలో సమావేశమైన యూనియన్ సభ్యులు

పోలవరం రూరల్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. పోలవరం మండలం గూటాలలో అరుణోదయ కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ యూనియన్ సమావేశం అధ్యక్షుడు రమణోజు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ జనరల్ బాడీకి ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజా భూలోకరావు, ఎలుగంటి రాజు, పెంటపాటి శ్రీను, కాకి సూర్య ప్రకాశం, పెంటపాటి అంజి, రమణోజు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్



ద్వారకాతిరుమల: జాజులకుంటలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వనిత తదితరులు



జంగారెడ్డిగూడెం: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

ద్వారకాతిరుమల: దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. జాజులకుంటలో ఆదివారం జరిగిన బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడారని, నిజాయతీ, అంకిత భావం, సేవాతత్పరతలే కవచాలుగా చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ బత్తుల బేబి శాంతి, ఎంపీటీసీ వసంతాటి లక్ష్మి, బత్తుల విజయశేఖర్, బొండాడ వెంకన్నబాబు, దాసరి రాంబాబు, దొప్పసాని రాధాకృష్ణా, రాంబాబు, పానమాల ఉమామహేశ్వరరావు, మల్లిపూడి నాగమణి, షేక్ మస్తాన్ బాషా, భోగరాజు సాయికృష్ణ, గుర్రాల లక్ష్మణ్, అన్సారి, చిలకా సతీష్ తదితరులున్నారు.

బాబూ జగజ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

జంగారెడ్డిగూడెం: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని సందర్భంగా ఆదివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు అహర్నిశలు పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు చిటికెలా అచ్యుతారామయ్య, కౌన్సిలర్లు నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు ఒరుగంటి నాగేంద్ర, నాయకులు బత్తిన చిన్న, గెద్దాడ శ్రీనివాస్, షేక్ అక్బర్, జహీర్ బైగా తదితరులు పాల్గొన్నారు

బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి

ఆహార భద్రతను ఆవశ్యకతను గుర్తించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ఏర్పాటుకు కృషిచేసిన మహనీయుడు బాబూ జగజ్జీవనరామ్ అని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగజ్జీవనరామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం పోరాడిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్ నేకూరి కిషోర్, దిర్సిపాము రాజేష్, జెట్టి ఆదిత్య, దళితులు పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థానం ఉద్యోగులకు వైద్య పరీక్షలు

ద్వారకాతిరుమల: ప్రతి వ్యక్తి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని శ్రీవారి దేవస్థానం డీఈఓ భద్రాజీ అన్నారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి ఆదేశాల మేరకు క్షేత్రంలోని హరిణి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏలూరుకు చెందిన విజయ హాస్పిటల్ వైద్యులు ఆలయ సిబ్బందికి గుండె, నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రితీష్ పి.తేజస్వి వైద్యసేవలందించారు. ప్రతి ఒక్కరికీ ఈసీజీ, ఎకో కార్డియోగ్రం పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.

జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి



చింతలపూడి: పశువుల ఆస్పత్రిలో జంతువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు



జంగారెడ్డిగూడెం: పశువైద్యశాలలో కుక్కకు రేబిస్ టీకా వేయిస్తున్న దృశ్యం



వేలేరుపాడు: పెంపుడు కుక్కకు టీకాలు వేస్తున్న పశు వైద్య అధికారులు, సిబ్బంది

చింతలపూడి: జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం చింతలపూడి వెటర్నరీ హాస్పిటల్ వద్ద జంతువులకు టీకాలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా జి ధనలక్ష్మి మాట్లాడుతూ జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వల్ల వ్యాధులకు గురికాకుండా కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరరావు, కార్యదర్శి డి రామకృష్ణ, కోశాధికారి రాజగోపాల్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ శీతాల గాంధీ, వెటర్నరీ మండల పశు వైద్యాధికారి డా బి.శివనాగేంద్ర బాబు, డా తేజశ్రీ, సిబ్బంది సిద్ధి రాములు, రంగారావు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

జంగారెడ్డిగూడెం: జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పీఎన్వీ శేఖర్ దొర మాట్లాడుతూ సుమారు 65 పెంపుడు శునకాలకు రేబీస్ నివారణ వ్యాధి టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పీఎన్వీ శేఖర్ దొరతో పాటు లక్కవరం పశువైద్యాధికారి డాక్టర్ భీమేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరుపాడు: మండలంలోనీ పశువుల ఆస్పత్రి వద్ద పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలంలో కుక్కలకు రోగాలు, వ్యాధులు వస్తుంటాయని, వ్యాధుల నివారణకు టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ భవాని, పశుసంవర్ధక సహాయకులు అశోక్, రాంపండు, రాంబాబు, భౌ అండ్ యారో స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ కొవ్వాల క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.